# ఇన్నోవేషన్ పంచాయత్‌తో యువతకు
# సమాన అవకాశాలు

- అర్హులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ విజయేందిర బోయి

4 లో




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
బుధవారం, డిసెంబర్ 17, 2025
పేజీలు: 6










# చివరి విడతకు సిద్ధం

-ఉమ్మడి జిల్లాలో నేడు 504 పంచాయతీలు, 4,020 వార్డులకు పోలింగ్

-52 సర్పంచులు, 945 వార్డు స్థానాల్లో ఏకగ్రీవ ఎన్నిక

-4,850 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు.. ఎన్నికల విధుల్లో 9,660 మంది సిబ్బంది

-7,355 మంది పోలీసులతో బందోబస్తు..

మహబూబ్‌నగర్ డిసెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )

పల్లె పోరులో చివరి విడత పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. మూడు విడతలుగా నిర్వహించ తలపెట్టిన ఎన్నికల్లో మొదటి విడత 11వ తేదీన, రెండో విడత 14వ తేదీన పూర్తి కాగా, నేడు బుధవారం చివరి విడత నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ జరుగనుంది. ఆ తర్వాత 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. మొదటి రెండు విడతల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లను సాధించిన ఉత్సాహంలో ఉండగా, బీఆర్ఎస్ కూడా తన పట్టును నిలుపుకుంటోంది. బీజేపీ గతంలో లేని విధంగా అడపాదడపా సీట్లను సాధించుకుంటోంది. సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్‌లు కూడా ఉమ్మడి జిల్లాలో -మిగతా 2లో..





## మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సమస్త
# ఏర్పాట్లు పూర్తి

- నేడు ఐదు మండలాల్లో పోలింగ్
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఓటింగ్

మహబూబ్‌నగర్ డిసెంబర్ 16 (ప్రజాజ్యోతి బ్యూరో )

జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అడ్డాకల్, బాలానగర్, భూత్పూర్, జడ్చర్ల, మూసాపేట మండలాల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నికలకు బుధవారం (డిసెంబర్ 17) పోలింగ్ నిర్వహించనున్నారు. -మిగతా 2లో..



## పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన
# పోలీసు బందోబస్తు

- జడ్చర్లలో పోలీసు సిబ్బందికి ఎస్పీ జానకి సమగ్ర బ్రీఫింగ్
- 145 గ్రామాలు, 212 పోలింగ్ కేంద్రాల్లో 1249 మంది పోలీసుల మోహరింపు

మహబూబ్‌నగర్ డిసెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )

స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా బుధవారం జరగనున్న గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా జడ్చర్ల మండల కేంద్రంలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ దరావత్ జానకి మంగళవారం సమగ్ర బ్రీఫింగ్ నిర్వహించారు. -మిగతా 2లో..



# చివరి విడతకు సిద్ధం

పలు అంతర్గత పొత్తులతో విజయాలు నమోదు చేసుకుంటున్నాయి. ఇక చివరి దశలో ఎవరి అదృష్టం ఎలా ఉందో బుధవారం తేలనుంది. మొదటి దశ నుంచి మూడో దశ పోలింగ్ కేవలం వారం రోజుల్లోనే పూర్తి చేశారు. సమయం తక్కువగా ఉండటంతో ఊర్లలో పండుగ వాతావరణం నెలకొంది. ఓటుకు నోట్లు పంచి, మద్యం వరద పారించారు. దాంతో ఊర్లకు ఊర్లు మత్తులో మునిగాయి. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు, వివిధ పనులు, ఉద్యోగం, చదువు నిమిత్తం వెళ్లినవారు ఓట్ల పేరుతో ఊర్లకు రావడంతో వారం రోజుల నుంచి గ్రామాలు సందడి సందడిగా కనిపించాయి. బుధవారం పోలింగ్ పూర్తికానుండటంతో ఆ సందడి మాయం కానుంది. నిన్నటి వరకు ఓట్లు అడిగిన వారు నేటి సాయంత్రం నుంచి పట్టించుకునే పరిస్థితులు ఉండవు. మూడో విడత పోలింగ్‌కు అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో కేటాయించిన గ్రామాలకు పోలింగ్ సిబ్బందిని తరలించారు.

504 పంచాయతీల్లో ఎన్నికలు..

ఉమ్మడి జిల్లాలో మూడో విడతలో మొత్తం 563 పంచాయతీలకు, 5,016 వార్డులకు ఎన్నికల నిర్వహణకు షె డ్యూల్ విడుదలైంది. అందులో 52 స ర్పంచ స్థానాలు, 945 వార్డులు ఏకగ్రీ వం అయ్యాయి. బుధవారం 504 పంచాయతీలకు, 4,020 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ స్థానాలకు 1,651 మంది, వార్డు స్థానాలకు 9,918 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నేడు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పోలింగ్ నిర్వహణకు 4,850 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 9,660 సిబ్బందిని కేటాయించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. సోమవారం ప్రచారం పూర్తికావడంతో మంగళవారం ప్రలోభాలకు తెరతీశారు. ఓటుకు నోటుతోపాటు మద్యం కూడా పంపిణీ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం సర్పంచ పదవి కోసం చేస్తున్న ఖర్చును చూసి ఆర్థిక స్తోమత లేని అభ్యర్థులు జంకుతున్నారు. ఒక్కో ఊర్లో రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు, మేజర్ పంచాయతీల్లో రూ.50 లక్షల వరకు కూడా ఖర్చు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఖర్చు చేసినా అభ్యర్థులను ఓటర్లు తిరస్కరిస్తున్నారు. ఓడిపోయిన అభ్యర్థులు తమ ఆవేదనను తమ సోషల్ ఖాతాల్లో పంచుకుంటున్నారు. కొందరు ఇచ్చిన డబ్బులను వాపస్ అడుగుతున్నారు. ఇక మూడో విడతలో చివరగా ఎంత ఖర్చు చేస్తారో.. అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.

7 జీపీలు.. 51 వార్డులకు ఎన్నికల్లేవ్..

ఉమ్మడి పాలమూరు జిల్లాల్లో మూడో విడత ఎన్నికల్లో భాగంగా ఏడు పంచాయతీలకు, 51 వార్డులకు ఎన్నికలు జరగడం లేదు. అందులో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆరు పంచాయతీలు ఉండటం విశేషం. ఈ జిల్లాలోని అమ్రాబాద్ మండలంలో ఉన్న బీకే లక్ష్మాపూర్, వంగురోనిపల్లి, కుమ్మరోనిపల్లి, కల్ములోనిపల్లి, ప్రశాంత్ కాలనీల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ రిలీజ్ అయినా, పోలింగ్ మాత్రం జరగడం లేదు. గతంలో ఏజెన్సీ గ్రామాల్లో అంతర్భాగంగా ఉన్న ఈ గ్రామాలు నూతన పంచాయతీరాజ్ చట్టం వచ్చిన తర్వాత ప్రత్యేక పంచాయతీలను చేశారు. అయితే అవి ఏజెన్సీ నోటిఫైలో ఉండటంతో ట్రైబల్స్‌కు రిజర్వ్ చేశారు. కానీ ఆ ఐదు పంచాయతీల్లో ఒక్కచోట కూడా ట్రైబల్స్ లేరు. దీంతో ఎన్నికలు జరగడం లేదు. అలాగే ఇదే జిల్లా చారకొండ మండలం ఎర్రవెల్లిలో భూనిర్వాసితులు ఎన్నికలను బహిష్కరించారు. అక్కడ కూడా పోలింగ్ జరగడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం శంకరంపల్లి తండా ఎస్టీకి రిజర్వ్ చేయగా.. అక్కడ ఆ అభ్యర్థి లేకపోవడంతో నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో అక్కడా ఎన్నికలు జరగడం లేదు. ఈ గ్రామాల్లో ఉన్న 51 వార్డులకూ కూడా ఎన్నికలు జరగడం లేదు. కొన్నిచోట్ల నామినేషన్లు దాఖలు కాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

# మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సమస్త ఏర్పాట్లు పూర్తి

ఈ ఐదు మండలాల్లో మొత్తం 133 గ్రామ పంచాయతీలకు, 1152 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో 10 సర్పంచ్ స్థానాలు, 231 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. జడ్చర్ల మండలంలో ఒక సర్పంచ్ స్థానం, 7 వార్డు సభ్యుల స్థానాలకు జీరో నామినేషన్లు నమోదు అయ్యాయి. ఈ మేరకు మిగిలిన 122 సర్పంచ్ స్థానాలు, 914 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది.
ఎన్నికల నిర్వహణ కోసం 133 మంది రిటర్నింగ్ అధికారులను నియమించగా, రిజర్వ్‌తో కలిపి మొత్తం 146 మంది రిటర్నింగ్ అధికారులు విధుల్లో ఉన్నారు. సర్పంచ్ ఎన్నికలకు ఏకగ్రీవాలను కలుపుకొని మొత్తం 440 మంది అభ్యర్థులు, వార్డు సభ్యులుగా 2584 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.
పోలింగ్ నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్‌తో కలిపి మొత్తం 3005 మంది పి.ఓ.లు, ఓ.పి.ఓ.లను నియమించారు. అందులో పి.ఓ.లు 2310 మంది, ఓ.పి.ఓ.లు 3386 మంది అందుబాటులో ఉన్నారు. 28 జోన్లకు గాను రిజర్వ్‌తో కలిపి 32 మంది జోనల్ అధికారులను నియమించారు. డిసెంబర్ 17న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనుండగా, మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలతో పాటు ఉప సర్పంచ్ ఎన్నిక కూడా జరగనుంది. 1152 పోలింగ్ కేంద్రాలకు గాను



రిజర్వ్‌తో కలిపి మొత్తం 1551 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం వీడియో గ్రఫీ చేయనుండగా, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. అదనంగా మైక్రో ఆబ్జర్వర్లను కూడా నియమించి, ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## ఒక్కసారి ఆశీర్వదించి సర్పంచ్ గా ఎన్నుకోండి

- ఉంగరం గుర్తుకు ఓటేసి గెలిపించండి
-గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తా
-చందాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి తిప్పర్తి పవన్ రెడ్డి

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
నేడు జరగబోయే ఎన్నికల్లో ఉంగరం గుర్తుకు ఓటు వేసి ఒక్కసారి సర్పంచ్గా అవకాశం కల్పించాలని చందాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి పవన్ రెడ్డి గ్రామ ప్రజలకు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో వారం రోజు ప్రచారంలో భాగంగా గ్రామ అన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని అన్ని సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. గ్రామంలో అని సర్పంచ్ అభ్యర్థి తిప్పర్తి పవన్ రెడ్డి వ్యాఖ్యానించారు



పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన

# పోలీసు బందోబస్తు



ఎన్నికల విధుల్లో పాటించాల్సిన చేయవలసినవి%-%చేయకూడనివి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్పీ స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులు లేకుండా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు తలెత్తినట్లయితే వెంటనే నియంత్రణ చర్యలు చేపట్టి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 1249 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ తెలిపారు. ఇందులో 1 ఎస్పీ, 2 అదనపు ఎస్పీలు, 7 డీఎస్పీలు, 29 ఇన్స్పెక్టర్లు, 66 సబ్ ఇన్స్పెక్టర్లు ఉండగా, మిగిలిన 1144 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. ఈ బందోబస్తు అడ్డకల్, బాలానగర్, భూత్పూర్, జడ్చర్ల, మూసాపేట, నవాబుపేట మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 145 గ్రామాల్లో 212 పోలింగ్ కేంద్రాలు, 1254 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 44 సమస్యాత్మక గ్రామాల్లో 52 పోలింగ్ కేంద్రాల్లో 394 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వివరించారు. భద్రతా చర్యల్లో భాగంగా 44 రూట్ మొబైల్ వాహనాలు, 16 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, 5 స్ట్రైకింగ్ ఫోర్సులు, 5 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను మోహరించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ మూడో విడత ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జిల్లా ఎస్పీ జానకి స్పష్టం చేశారు


## ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

భూత్పూర్: భూత్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సిబ్బందికి పలు సూచనలు చేశారు.రూట్ వారిగా బస్సులు ఏర్పాటు చేసి ఆయా పోలింగ్ కేంద్రాలకు సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పీఓలు పోలింగ్ సామాగ్రి స్వీకరించే సమయంలో అందిన మెటీరియల్ చెక్ లిస్ట్ ప్రకారం చెక్ చేసుకోవాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా బ్యాలెట్ బాక్సులు సరిగా పనిచేస్తున్నాయా లేదా పరీక్షించుకోవాలని, బ్యాలెట్ పేపర్లపై ఉన్న గుర్తులను ఫారం-9లోని పోటీ అభ్యర్థుల వివరాలతో సరిపోల్చుకోవాలని సూచించారు. చిన్న తప్పిదం జరిగినా దానికి పీఓ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సామాగ్రి స్వీకరించిన అనంతరం పి. ఓ.లు, ఓ.పి ఓ లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారులుఎం.పి.డి. ఓ,తహశీల్దార్ లు, ఎం.ఈ.ఓ.లుతదితరులు ఉన్నారు.



# గెలిచిన సర్పంచ్ అభ్యర్థిని సత్కరించిన మాజీ సింగల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య

**కొల్లాపూర్ డిసెంబరు 16 ప్రజా జ్యోతి**



పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి గెలుపొందినమద్దం చంద్రమ్మకి పూలమాలతో శాలువా సన్మానించిన బహుజన నాయకులు మంగళవారం రోజు ఉదయం బహుజన నాయకులుమంచాలకట్ట గ్రామానికి చేరుకొని మంచాలకట్ట గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికైన మధుగం చంద్రమ్మ ను సన్మానించినకొల్లాపూర్ మండల సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య బరిగల సత్యనారాయణ యాదవ్ ,18 వ వార్డు మాజీ కౌన్సిలర్ అలివేల వాసు. 9వ వార్డు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి అన్వర్ ,మాలల రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రామదాస్.మద్దం చంద్రమ్మ కి పూలమాల శాల్వతో సన్మానం చేశారు.కొల్లాపూర్జిసింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ. ఒక బీసీ సాధారణ మహిళ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలవడం మంచాలకట్ట అభివృద్ధికి దోహదపడుతుందని ,రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఆశీస్సులతో గ్రామ అభివృద్ధి జరుగుతుందని, ప్రతిపక్ష పార్టీల, రాష్ట్ర నాయకత్వాన్ని చేపట్టిన వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ , మరియుబి, ఆర్ ,ఎస్, పార్టీ బలపరిచిన అభ్యర్థిపై గెలుపొందినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు, మంచాలకట్ట గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయుటకు రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు సహకారంతో అభివృద్ధి చేయాలని కొనియాడారు,కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్య బరిగల సత్యనారాయణ యాదవ్ ఎండి అన్వర్ కర్నే వాసు మద్దెల రామదాస్ తదితరులు పాల్గొన్నారు

# విజయ్ దివస్"సందర్భంగా జవాన్ల త్యాగాలను స్మరించుకున్న కొప్పునూర్ ఎస్సీ బాలుర వసతిగృహ ఇంచార్జి రవీందర్ రెడ్డి

**చిన్నంబావి, డిసెంబర్ 16 (ప్రజాజ్యోతి):**



చిన్నంబావి : మండలం లోని కొప్పునూర్ ఎస్సీ బాలుర వసతిగృహ ఇంచార్జి వసతిగృహ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి విజయ్ దివస్ సందర్భంగా ఆనాడు 1971లో దేశం కోసం పాకిస్థాన్ తో వీర జవాన్లు చేసిన వీరోచిత పోరాటం చేసి విజయం సాధించిన డిసెంబర్ 16 ను గుర్తుచేసుకుంటూ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసి తన మనస్సులోని బావాలను పత్రికా ముఖంగా,వెలిబుచ్చారు.1971 డిసెంబర్ 16.పాకిస్తాన్ సైన్యాధిపతి నియాజీ ఇక.చేసేదిలేక,తలవంచి 93 వేలమంది సైనికులతో డాకాలో భారత్ కు లొంగిపోయింది.పాకిస్తాన్ ఓటమి చెందిన తరువాత తూర్పు పాకిస్తాన్ స్వతంత్ర బంగ్లాదేశ్ గా ఏర్పడింది.1971లో తూర్పు పాకిస్తాన్ లో పాకిస్తాన్ ఆధిపత్యం ఆంక్షలతో మొదలైన స్వతంత్రపోరు క్రమంగా భారత్,పాకిస్తాన్ యుద్దానికి దారి తీసింది.ఈ యుద్ధంలో భారత్ అకాండ విజయం సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఈరోజున విజయ్ దివస్ గా స్మరించుకుంటాము అని ఒక పత్రికా ప్రకటన ద్వారా తన బావాలను పంచుకున్నారు.

# నర్వలో నేడే పోలింగ్ అన్ని ఏర్పాట్లు పూర్తి




**174 బూతులకు గాను152 బూతుల్లో ఓటింగ్**

**400 మంది ఎన్నికల సిబ్బందికి మెటీరియల్ పంపిణీ**

**ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకే పోలింగ్**



**నర్వ డిసెంబర్ 16 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో తో పాటు ఆయా గ్రామాల్లో మొత్తము 152 పోలింగ్ కేంద్రాల్లో నేడు మూడో విడత పోలింగ్ జరగనున్నదని ఎన్నికల అధికారి, ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం 174 పోలింగ్ బూతులకు గాను 22 బూతులు ఏకగ్రీవం కాగా 152 బూతులలో నేడు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు, ఎన్నికల సందర్భంగా 400 మంది సిబ్బంది కి బ్యాలెట్ బాక్సులు బ్యాలెట్ పత్రాలను అందజేయడం జరిగిందని తెలిపారు, ఓటర్లు ఉదయం ఏడు గంటలు ఈ మధ్యాహ్నం ఒంటిగంట వరకే పోలింగ్ ఉంటుందని అనంతరం రెండు గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు, ఓటర్లు తమ ఓటును సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు వినియోగించుకోవాలని తెలిపారు



## బత్తిని వెంకటేష్ కు నివాళులు



**కొల్లాపూర్ డిసెంబర్ 16 ప్రజా జ్యోతి**

పెంట్లవెల్లి మండలం కేంద్రంలోని తాపీ మేస్త్రి బత్తిని వెంకటేష్ పార్దివ పార్థివ దేహానికి పెంట్లవెల్లి టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ గెలిచిన అభ్యర్థి సర్పంచ్ చిట్టెమ్మ సురేందర్ గౌడ్, మరియు పెంట్లవెల్లి బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ %ఽ%వార్డు మెంబెర్ గోవురాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భైరోజు శేషు, వార్డ్ మెంబర్లు యాగోసు, కొత్తపేట కురుమూర్తి, శేషు, సురేష్,శ్రీకాంత్, బత్తిని రాజు, పసుపుల రాజు,లావణ్య, వెంకటి, హరీష్ తదితరులు పాలుగోన్నారు.

## చిన్నంబావి మండలంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన : సీసీఎస్, సీఐ అశోక్ కుమార్



**చిన్నంబావి, డిసెంబర్ 16 (ప్రజాజ్యోతి):**

మూడవ విడత గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో చిన్నంబావి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సీసీఎస్,సీఐ అశోక్ కుమార్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్, చిన్నమారూర్, వెల్లటూరు, అయ్యవారిపల్లి, కొప్పునూర్, చెల్లెపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పోలీస్ సిబ్బందితో కలిసి సందర్శించారు.పోలింగ్ సమయంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికలు ప్రశాంతంగా,నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ పూర్తిగా అప్రమత్తంగా ఉంటుందని సీఐ తెలిపారు.ఈ పరిశీలనలో సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా ఉంటా

### సర్పంచ్ జాను

**కొల్లాపూర్ డిసెంబర్ 16 ప్రజా జ్యోతి**

కొల్లాపూర్ నియోజక వర్గం కోడేరు మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన పల్లె కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకున్న నూతన సర్పంచ్ జాన్ మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించి కుటుంబానికి తోడుగా ఉంటారని ఆయన భరోసానిచ్చారు.



# ప్రతి ఒక్కరు ఆరోగ్యంపట్ల అవగాహన కల్గి ఉండాలి





## -చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మధుసూదన్ రావు

**నాగర్ కర్నూల్:డిసెంబర్ 16 ప్రజా జ్యోతి**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ చైర్మన్ మరియు సెక్రెటరీ ఆదేశాల మేరకు మంగళవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు నందు నిర్వహించిన యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధుసూదన్ రావు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హాజరై మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 12వ తేదీన యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే నిర్వహించుకుంటామని,దీనిముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్కరు ఆరోగ్యంపట్ల అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని మనం ఆరోగ్యంగా ఉంటే అదే గొప్ప ఆస్తితో సమాన మనన్నారు. శారీరకంగానే కాకుండా మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే మనిషి పరిపూర్ణ ఆరోగ్యవంతుడు అవుతాడని,విద్యార్థులు బాల్యం నుంచే ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండి,పరిశుభ్రతను పాటించాలని అన్నారు.పాఠశాల పరిసరాలు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని,మనం పరిశు భ్రతను పాటిస్తూనే తోటి వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ రామ్ ఆర్య డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్,పవన శేష సాయి అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్,జి భవాని బాయి అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.తదనంతరం నాగర్ కర్నూల్ పట్టణంలోని గవర్నమెంట్ ఆసుపత్రి నందు ఆరోగ్యం పట్ల అవగాహన కొరకు భవాని బాయి,అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రోగులకు మంచి ఆరోగ్యం కొరకు పాటించాల్సిన నియమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ డాక్టర్స్ మరియు సిబ్బంది,రోగులు పాల్గొన్నారు.

# గ్రామీణ యువ క్రీడాకారులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ డిసెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువ క్రీడాకారులు ఇలాంటి క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు.ప్రొఫెషనల్ ఫోటో %ఌ% వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో స్వర్గీయ అఫ్రోజ్ ఖాన్, స్వర్గీయ ఖాదర్, స్వర్గీయ అంజాద్ ఖాన్, స్వర్గీయ సయ్యద్ ముస్తాక్ (లడ్డు), స్వర్గీయ వెంకటే, స్వర్గీయ ఎస్.వి. గోపాల్ స్మారకార్థం నిర్వహిస్తున్న అంతర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ టోర్నమెంట్ ఈ నెల 18 నుంచి 21 వరకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జరగనుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు విశేష ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభ వెలుగులోకి రావడానికి ఇటువంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నిర్వాహకులకు, పాల్గొననున్న క్రీడాకారులకు ఆయన శు



భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మైత్రి యాదయ్య, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నర్సింహ, పట్టణ అధ్యక్షులు అంజి యాదవ్, కార్యదర్శి రవికుమార్, బాలచందర్, గోపి, నర్సప్ప, రాఘవులు, మల్లేష్, రాజేష్, ఇమ్రాన్, అయూబ్ పాల్గొన్నారు.

# ఇన్నోవేషన్ పంచాయత్‌తో యువతకు సమాన అవకాశాలు

**- అర్హులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ విజయేందిర బోయి**

**- డిసెంబర్ 20న మహబూబ్‌నగర్ ఐటీ టవర్‌లో 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమం**

**మహబూబ్‌నగర్ డిసెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమం రాష్ట్రంలోని ప్రతిభ ఉన్న యువత, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లకు సమాన అవకాశాలు కల్పించే వేదికగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. అర్హులైన యువ పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.మంగళవారం ఐడీఓసీ కలెక్టర్ చాంబర్‌లో 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టీజీఐసీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఆవిష్కర్తలు, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం డిసెంబర్ 20, 2025 శుక్రవారం ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్ ఐటీ టవర్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతిభకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఈ కార్యక్రమం ఒక ప్రభావవంతమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఇన్నోవేషన్ పంచాయత్‌లో పాల్గొని తమ ఆవిష్కరణలపై నిపుణుల నుంచి ప్రత్యక్ష సలహాలు పొందవచ్చని తెలిపారు. ఆలోచన ధృవీకరణ, నమూనా రూపకల్పన, వ్యాపార విస్తరణకు సంబంధించిన మార్గదర్శకత్వంతో పాటు ప్రభుత్వ స్టార్టప్ పథకాలు, ఇంక్యుబేషన్ సహాయం వంటి అవకాశాలపై స్పష్టమైన సమాచారం అందించనున్నట్లు చెప్పారు.పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచిస్తూ, యువ పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పిలుపునిచ్చారు.



# డిసిసి మాజీ జిల్లా అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బాపన్ పల్లి ఉపసర్పంచ్ ఊరబాయి అంజప్ప



**దామరగిద్ద డిసెంబర్ 16( ప్రజాజ్యోతి):**



నారాయణపేటలో డిసిసి మాజీ జిల్లా అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డిని సివిఆర్ భవన్ లో మంగళవారం బాపన్ పల్లి గ్రామ ఉపసర్పంచ్ ఊం బాయి అంజప్పతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు దేవేంద్రప్ప, శివ కుమార్, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్ మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ బొడ్డు నరసింహులు మాజీ విఆర్వో పరమాత్మ వెంకటప్ప జనగారి మాణిక్యప్ప తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో గ్రామ అభివృద్ధి స్థానిక సమస్యలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఉపసర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను కుంభం శివకుమార్ రెడ్డి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రజాసేవలో మరింత కృషి చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

# సర్పంచ్‌గా ఒక్క అవకాశం ఇవ్వండి



**ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా.**
**నేడు జరగబోయే ఎన్నికలలో హ్యాండ్ బ్యాగ్ గుర్తుకు ఓటు వేయండి.**
**సర్పంచ్ అభ్యర్థి మీసాల రేణుక ఎల్లేష్.**

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

గ్రామ సర్పంచ్ గా ఒక్క అవకాశం ఇస్తే, వీపనగండ్ల గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, మీసాల రేణుక ఎల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి మీసాల రేణుక ఎల్లేష్ మాట్లాడుతూ... గత వారం రోజులుగా ఎన్నికల ప్రచారంలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. తనను సర్పంచ్ గా గెలిస్తే, గోవర్ధనగిరి నుండి తూముకుంట మెయిన్ రోడ్డు వరకు సైడ్ డ్రైనేజీ, ఎస్సీ వాడలో ఫంక్షన్ హాల్, బాబు జగ్జీవన్ రామ్ కాలనీలో సైడ్ డ్రైనేజీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్, క్రిస్టియన్ చర్చి అభివృద్ధి, ( కాంపౌండ్ వాల్, బోర్ ) ప్రతి కులానికి కమ్యూనిటీ హాల్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫీస్ ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నేడు జరగబోయే సర్పంచ్ ఎన్నికలలో హ్యాండ్ బాగ్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# సర్పంచ్ అభ్యర్థిగా ఒక అవకాశం కల్పించండి

## పానుగంటి శ్రీదేవి నరసింహ



నాగర్ కర్నూల్ డిసెంబర్ 16 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

కత్తెర గుర్తుకు ఓటు వేసి గ్రామ సర్పంచ్ గా ఒక్కసారి అవకాశం కల్పించాలని గువ్వలోనిపల్లి సర్పంచ్ అభ్యర్థి పానుగంటి శ్రీదేవి నరసింహ గ్రామ ప్రజలకు కోరారు. గతం వారం రోజుల నుంచి ప్రచారంలో భాగంగా గ్రామ సమస్యలన్నీ తెలుసుకున్నానని అన్ని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి పానుగంటి శ్రీదేవి నరసింహ పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి ఏజెండగా ముందుకెళ్తానని సర్పంచ్ అభ్యర్థి స్పష్టం చేశారు. అభ్యర్థి వెంట గ్రామ ప్రజలు నాయకులు తదితరులు ఉన్నారు

# కౌంటింగ్ కేంద్రాల్లో పూర్తి పారదర్శకత

**-ఓట్ల లెక్కింపు మొత్తం వీడియో గ్రఫీ తప్పనిసరి**
**- వెబ్‌కాస్టింగ్, వెబ్‌కెమెరాలతో కౌంటింగ్ ప్రక్రియ రికార్డింగ్**
**- మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలపై అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష**



**మహబూబ్‌నగర్ డిసెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
గ్రామ పంచాయతీ మూడో విడత ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల్లో వీడియో గ్రఫీ, వెబ్‌కెమెరాల ద్వారా రికార్డింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయనీ దేవి తో కలిసి బాలానగర్, జడ్చర్ల, మూసాపేట, భూత్పూర్, అడ్డాకల్ మండలాలకు చెందిన ఎంపీడీవోలు, తహశీల్దార్లు, ఎంఈఓలు, ఎంపీఓలు, స్టేజ్%-%2 రిటర్నింగ్ అధికారులు, జోనల్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించి పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లను సమీక్షించారు.మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ఎలాంటి సమస్యలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మొదటి, రెండో విడత ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని పేర్కొంటూ, అదే విధంగా మూడో విడత కూడా సజావుగా ముగించేందుకు సమగ్ర ప్రణాళిక అవసరమని తెలిపారు.పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 1 గంటలకు ముగించాలని, సమయం ముగిసిన తర్వాత ఎవరినీ పోలింగ్‌కు అనుమతించకూడదని స్పష్టం చేశారు. అయితే పోలింగ్ ముగిసే సమయానికి క్యూలో ఉన్న ఓటర్లను అనుమతించాలని తెలిపారు. పోలింగ్ శాతాన్ని ఉదయం 9, 11 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు ప్రకటించి టి%-%పోల్ సాఫ్ట్‌వేర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.
ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2 గంటలకు ఖచ్చితంగా ప్రారంభించాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద తదుపరి ఉదయం వరకు సెక్షన్ 163 అమలు చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కోసం విశాల హాళ్లు ఎంపిక చేసి 4 నుంచి 7 కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేయాలని, సరైన వెలుతురు, గాలి ప్రసరణ ఉండేలా చూడాలని తెలిపారు. స్టేజ్%-%2 రిటర్నింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ, ఎంపీడీవోలు, జోనల్ అధికారులతో సమన్వయం కొనసాగించాలని, పంపిణీ కేంద్రాల్లో పోలింగ్ సామాగ్రి పూర్తిగా అందిందో లేదో తనిఖీ చేయాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి కనీసం రెండు ఇంక్ ప్యాడ్లు ఇవ్వాలని, అన్ని ఎన్నికల ఫారమ్‌లు సరైన సీరియల్ నంబర్లతో అందించాలని ఆదేశించారు.సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3.30 గంటలలోపు, సర్పంచ్ లెక్కింపు 4.30 గంటలలోపు, ఉప సర్పంచ్ ఎన్నిక 6.30 గంటలలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేసి, అనంతరం సాధారణ బ్యాలెట్ పేపర్ల లెక్కింపు చేపట్టాలని స్పష్టం చేశారు.ఎన్నికల పరిశీలకురాలి అనుమతి లభించిన తర్వాత మాత్రమే విజేతల ప్రకటన చేయాలని, రాతపూర్వకంగా అభ్యర్థించినపుడే రీకౌంటింగ్‌కు అనుమతించాలని తెలిపారు. రీకౌంటింగ్‌పై ఆర్ ఓ తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని పేర్కొన్నారు. వెబ్‌కాస్టింగ్ సౌకర్యం లేని గ్రామ పంచాయతీల్లో కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నికల ప్రక్రియను పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా వీడియో గ్రఫీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట రెడ్డి, డీఈఓ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 21న జాతీయ లోక్ అదాలత్

**-గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా జడ్జి**

**నాగర్ కర్నూల్ : డిసెంబర్ 16 ప్రజా జ్యోతి**
నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో ఈ నెల 21న, నిర్వహించే లోక్ అదాలత్ గోడ పత్రికను మంగళవారం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆవిష్కరించారు.జిల్లాన్యాయాధికార సంస్థ ద్వారా ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కోర్టు అధికారులు తెలిపారు.ఈ లోక్ అదాలత్లో రాజీ చేసుకోదగిన కేసుల పరిష్కారానికి అవకాశం ఉందన,క్రిమినల్,చెక్ బౌన్స్,కేసులు,కుటుంబ వివాదాలు,మోటార్ వాహన ప్రమాద కేసుల విచారణ,భూవివాదాలు,బ్యాంకులకు సంబంధిత కేసులు,ఇతర పెండింగ్ కేసులను లోక్ అదాలత్ ద్వారా ముగించుకునే అవకాశం ఉందని,లోక్ అదాలత్ తీర్పులు అప్పీల్‌కు అవకాశంలేని తుది తీర్పులు సత్వర న్యాయంతో సమయం,డబ్బు ఆదా చేసుకో వచ్చని,ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,మండల న్యాయ సేవాధికారసంస్థలైన



అచ్చంపేట,కల్వకుర్తి,కొల్లాపూర్ లోజిల్లా జడ్జి రమాకాంత్ ర్యవేక్షణలో నిర్వహించడంజరుగుతుందని,స్పెషల్ జడ్జ్ ఫర్ పోక్సో కోర్ట్ నసీం సుల్తానా,డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఏ.శ్రీదేవి,సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీనిధి పాల్గొననున్నారని తెలిపారు

## శాంతి భద్రత పరిరక్షణకే పోలీస్ కవాతు

**-జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు**

**నాగర్ కర్నూల్:డిసెంబర్ 16ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికలు మూడో విడత పోలింగ్ ఈ నెల 17న జరగనుంది. అందులో భాగంగా జిల్లాలో మూడో విడతలోగల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో జిల్లా పోలీసుల చేత కవాతు నిర్వహించారు.శాంతిభద్రతల పరిరక్షణకే కావాతు నిర్వహించినట్లు అడిషనల్ వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో రేపు జరగనున్న పంచాయతీ ఎలక్షన్స్ మూడో విడత పోలింగ్ కు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని,సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఆ వాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని,ఎవరైనా పోలింగ్ కేంద్రాల వద్ద అవాంచనీయ చర్యలకు,ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కవాతులో అచ్చంపేట డిఎస్పి సాయి వెంకట్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు నాగరాజు,శంకర్ ఎస్ఐలు,భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన సర్పంచ్‌లు అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలి

**: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్‌నగర్ డిసెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మహబూబ్‌నగర్ నియోజకవర్గం హన్వాడ మండలానికి చెందిన అత్యకుంట తాండా గ్రామ సర్పంచ్ జర్పుల లక్ష్మణ్, టంకర గ్రామ సర్పంచ్ మెండె లక్ష్మి అచ్చెన్న మంగళవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల విశ్వాసంతో పదవులు పొందిన సర్పంచ్‌లు ఆ విశ్వాసాన్ని అభివృద్ధి రూపంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఎంతో ముఖ్యమని ఆయన గుర్తు చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే పరమావధిగా తీసుకొని విద్య, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పారదర్శకమైన పాలన అందించాలని కోరారు. గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అధికార యంత్రాంగంతో సమన్వయం సాధించి, సమిష్టి కృషితో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. నూతన సర్పంచ్‌ల నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్ రెడ్డి, అత్యకుంట తాండా గ్రామ ఉపసర్పంచ్ కుమార్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్నోవేషన్ పంచాయత్ పోస్టర్‌ని ఆవిష్కరించిన కలెక్టర్

జోగులాంబ గద్వాల జిల్లా:ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమం ద్వారా ప్రతిభ ఉన్న యువత, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లకు సమాన అవకాశాలు అందిస్తుందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ సూచించారు. మంగళవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (టీ-జీఐసీ) తెలంగాణలోని ఆవిష్కర్తలను, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం డిసెంబర్ 20, 2025 శుక్రవారం ఉదయం 10 గంటలకు నుండి సాయంత్రం 4 గంటల వరకు మహబూబ్‌నగర్ ఐటీటవర్‌లో నిర్వహించబడనుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిభకు సమాన అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా 'ఇన్నోవేషన్ పంచాయత్' ఒక ప్రభావవంతమైన వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవడానికి ఫార్మ్ లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఆవిష్కరణలపై నిపుణుల నుంచి ప్రత్యక్ష సలహాలు పొందవచ్చని తెలిపారు. ఆలోచన ధృవీకరణ, నమూనా రూపకల్పన, వ్యాపార విస్తరణలో మార్గదర్శకత్వం అందించడంతో పాటు ప్రభుత్వ స్టార్టప్ పథకాలు, ఇంక్యుబేషన్ సహాయం వంటి అవకాశాల గురించి స్పష్టమైన సమాచారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాగేంద్రం, జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక, డీపీఓ శ్రీకాంత్, నోడల్ అధికారి రమేష్ బాబు, ఈ.డి.యం. శివ, ఇన్నోవేషన్ సెల్ ప్రోగ్రామ్ లీడ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

